# సాక్షి
## విశాఖపట్నం

శుక్రవారం । 22 । మార్చి । 2024






**2,899 మందికి వైద్య సేవలు**

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా నిర్వహించిన శిబిరాల్లో మొత్తం 2,899 మందికి సేవలందించారు. IIలో



**మృత్యు ఊబిలో చిక్కి..**

శారదానదిలో స్నానానికి దిగి పెదగంట్యాడ మండలం దయాల్‌నగర్‌కు చెందిన యుగంధర్ మృతి చెందాడు. IIలో

**స్వయం ఉపాధికి 'తోడు'**



జగనన్న తోడుతో చిరువ్యాపారుల జీవితాల్లో సంతోషాలు నింపింది. రూ.10 వేలు చొప్పున వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రుణాలు మంజూరు చేసింది. IIలో

## న్యూస్‌రీల్

### నేవీ చీఫ్‌కు ఘన స్వాగతం



**గోపాలపట్నం:** భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ సతీసమేతంగా గురువారం విశాఖ చేరుకున్నారు. ఐఎన్ఎస్ డేగాలో ఆయనకు తూర్పు నావికాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, నేవీ అధికారులు స్వాగతం పలికారు.

### వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా రమణమూర్తి



**సాక్షి, విశాఖపట్నం:** వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ పి.వి.రమణమూర్తిని నియమించారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్యసేవలందిస్తూ పేరు ప్రఖ్యాతలు పొందిన రమణమూర్తి 2019లో వైఎస్సార్ సీపీ విశాఖ దక్షిణ సమన్వయకర్తగా కూడా పనిచేశారు. తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ రీజినల్ కోర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి రమణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

**ఇక్కడ**

# సిద్ధం

**అక్కడ**

# గందరగోళం



- ఇప్పటికే అన్ని సీట్లను ఖరారు చేసిన అధికార పక్షం
- ప్రచారంలోనూ దూకుడు పెంచిన అభ్యర్థులు
- పలుచోట్ల అభ్యర్థులను ప్రకటించలేకపోతున్న కూటమి నేతలు
- ఓటమి భయంతో మీనమేషాలు
- మరోపక్క పొత్తులపై మిత్రుల కత్తులు
- విభేదాలతో వీధికెక్కుతున్న అసంతృప్తులు

**సాక్షి, విశాఖపట్నం :** విజయంపై ధీమాతో ఉన్న అధికార వైఎస్సార్ సీపీ .. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటికే అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించింది. ఒక్క అనకాపల్లి లోక్‌సభ సీటు మినహా మిగిలిన అన్ని స్థానాల జాబితానూ విడుదల చేసింది. దీంతో ఆయా అభ్యర్థులు ఎన్నికలకు సిద్ధం అంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆ పార్టీ క్యాడరు కూడా ఊరు వాడల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వైఎస్సార్ సీపీ జెండాలను రెపరెపలాడిస్తున్నారు. అయితే ఓటమి భయం వెంటాడుతున్న ప్రతిపక్ష కూటమి టీడీపీ, జనసేన, బీజేపీలు తమ ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించే సాహసం చేయలేకపోతున్నాయి. తూతూ మంత్రంగా కొద్దిమంది పేర్లను మాత్రమే ప్రకటించి, మిగతా వారి పేర్లు వెల్లడించడానికి మీనమేషాలు లెక్కిస్తున్నాయి. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 16 అసెంబ్లీ, మూడు లోక్‌సభ స్థానాలున్నాయి. వీటిలో కూటమి పార్టీలు ఇప్పటివరకు అనకాపల్లి (జనసేన), నర్సీపట్నం, పాయకరావుపేట, మాడుగుల, విశాఖ తూర్పు, పశ్చిమ, గాజువాక, అరకు, రంపచోడవరం (టీడీపీ) అసెంబ్లీ స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ఖరారు చేశారు. మిగిలిన స్థానాల్లో (యలమంచిలి, పెందుర్తి, విశాఖ దక్షిణ, ఉత్తర, భీమిలి, పాడేరు) ఎవరిని నిలబెట్టాలో తేల్చుకోలేని గందరగోళ పరిస్థితిలో ఉన్నారు. జనసేనకు సంబంధించి ఇప్పటివరకు ఒక్క అనకాపల్లి అసెంబ్లీ స్థానాన్ని మాత్రమే అధికారికంగా ప్రకటించారు. జనసేన నుంచి విశాఖ దక్షిణ, పెందుర్తి, యలమంచిలి స్థానాలు తమకు కేటాయించినట్టు ఆ సీట్లను ఆశిస్తున్న నాయకులే ప్రకటించుకున్నారు తప్ప అధికారిక ప్రకటన విడుదల కాలేదు.

### లోక్‌సభ స్థానాల్లోనూ అదే పరిస్థితి

ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు లోక్‌సభ స్థానాల (విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)కు కూడా కూటమి నేతలు అభ్యర్థులను ఖరారు చేయలేకపోతున్నారు. విశాఖ లోక్‌సభ సీటు కోసం టీడీపీ నుంచి భరత్, బీజేపీ నుంచి జీవీఎల్ నరసింహారావు పోటీపడుతున్నారు. అనకాపల్లి నుంచి బీజేపీ తరపున సీఎం రమేష్, అరకు నుంచి కొత్తపల్లి గీతలు ఆశిస్తున్నారు. వీరిలో అనకాపల్లి సీఎం రమేష్‌కు, అరకు గీతకు కేటాయించారంటూ ప్రచారం జరుగుతుందే తప్ప అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఈ మూడు లోక్‌సభ స్థానాల అభ్యర్థులు ఎవరన్న దానిపై కూటమిలోనే పెద్ద గందరగోళం, అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. మరో యాభై రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి. నాలుగు వారాల్లోపు నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతుంటే.. ఇంకా తమ కూటమి ఉమ్మడి అభ్యర్థులను తేల్చుకోలేక పోతున్నారంటూ టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఆవేదన చెందుతున్నాయి.

### పొత్తులపై కత్తులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో కూటమి పార్టీలు ఇప్పటికే ప్రకటించిన చోట్ల అభ్యర్థులు, ఆశావహుల మధ్య రోజూ 'వార్' జరుగుతోంది.

- టీడీపీ మాడుగుల సీటును ఎన్ఆర్ఐ పైలా ప్రసాదరావుకు కేటాయించింది. ఈ సీటుపై ఆశలు పెట్టుకున్న అక్కడ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడులు ఏకమై పైలా అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ గెలిచే వారికే సీటివ్వాలంటూ రోడ్డెక్కారు.
- చోడవరం కేఎస్ఎన్ఎస్ రాజుకు ఖరారు చేయగా, టీడీపీ నుంచి ఆ సీటును ఆశించిన మల్లునాయుడు, ఇన్‌చార్జి తాతయ్యబాబు, జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు నిరసన గళం వినిపిస్తున్నారు.
- పాయకరావుపేట టికెట్‌ను టీడీపీ అనితకు కేటాయించడాన్ని అక్కడ జనసేన ముఖ్య నేతలు అంగీకరించడం లేదు. ఆమెను ఓడిస్తామని ఒట్టేసి చెబుతున్నారు.
- అనకాపల్లి స్థానాన్ని జనసేనలో నిన్నగాక మొన్న చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు ఇవ్వడాన్ని ఆ సీటును ఆశించి టీడీపీలో చేరిన మాజీ మంత్రి దాడి వీరభద్రరావు జీర్ణించుకోలేకపోతున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు అయితే ఆ పార్టీకే రాజీనామా చేశారు. మరికొంతమంది టీడీపీ నేతలు అసంతృప్తితో ఉన్నారు.
- విశాఖ దక్షిణ సీటును జనసేన నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఖరారైందన్న ప్రచారంతో ఆ నియోజకవర్గ జనసేన నాయకులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అక్కడ సీటుపై ఆశలు పెట్టుకున్న మహ్మద్ సాధిక్, డాక్టర్ మూగి శ్రీనివాసరావు, కందుల నాగరాజులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నారు.
- పెందుర్తి సీటు జనసేన నుంచి పంచకర్ల రమేష్‌బాబుకు ఖరారైందన్న ప్రచారంతో అక్కడ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. నియోజకవర్గంలో ఆయన తమ వర్గంతో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. తనకు సీటివ్వకపోతే పంచకర్లను ఓడించి తీరతామని తెగేసి చెబుతున్నారు.
- గాజువాకపై గంపెడాశలు పెట్టుకున్న జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావును కాదని టీడీపీ నుంచి పల్లా శ్రీనివాసరావుకు కేటాయించడంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయన పల్లాకు ఏ మేరకు సహకరిస్తారన్న దానిపై టీడీపీ లోనూ అనుమానాలున్నాయి.
- టీడీపీకి అరకు సీటును సివేరి దొన్నుదొరకు ఖరారు చేయడంతో అక్కడ ఇన్‌చార్జి శివేరి అబ్రహం ఆగ్రహంతో ఉన్నారు. ఇండిపెండెంటుగా పోటీ చేసైనా దొన్నుదొరను ఓడిస్తానని శపథం చేశారు.
- రంపచోడవరం టీడీపీ టికెట్‌ను మిరియాల శిరీషకు కేటాయించడాన్ని అక్కడ మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, వెంకటేశ్వరరావు ససేమిరా అంటున్నారు. శిరీష అభ్యర్థిత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు, ఆందోళనలు చేపడుతున్నారు.

ఇలా టీడీపీ–జనసేనల మధ్య పొత్తు ఉన్నా పలు స్థానాల్లో ఒకరంటే ఒకరు కత్తులు నూరుకుంటున్నారు. బహిరంగంగా వీధికెక్కుతున్నారు.

# ఇంటింటా ప్రచారమైనా..
# అనుమతి తప్పనిసరి

- ప్రచారాలు, సభలకు ఆర్వో అనుమతులు తీసుకోవాలి
- సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఉల్లంఘనలపై సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చు
- ఫిర్యాదుపై 100 నిమిషాల్లో విచారించి కేసు నమోదు చేస్తాం
- మీడియాతో పోలీస్ కమిషనర్ రవిశంకర్

**విశాఖ సిటీ:** రాజకీయ పార్టీలు ఎటువంటి కార్యక్రమాలను చేపట్టాలనుకున్నా తప్పనిసరిగా రిటర్నింగ్ అధికారి(ఆర్వో) నుంచి అనుమతులు పొందాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ స్పష్టం చేశారు. పోలీస్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటా ప్రచారం, బహిరంగ సమావేశాలు, సభలు నిర్వహించాలనుకుంటే ముందస్తు అనుమతులు తప్పనిసరి అని తేల్చి చెప్పారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

**సువిధ యాప్ ద్వారా దరఖాస్తులు**

- రాజకీయ పార్టీలు ఎటువంటి కార్యక్రమం నిర్వహించాలకున్న ముందుగా సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఒక వేళ సువిధ యాప్ పనిచేయని పక్షంలో రాతపూర్వకంగా ఆర్వోకి అందజేయాలి.
- వాటిని ఆర్వో పరిశీలించి ఎన్‌వోసీ కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు పంపిస్తారు.
- ఆ సమయంలో, ఆయా ప్రాంతంలో ర్యాలీ, ప్రచారం, సభ కోసం ఎవరైనా అనుమతికి దరఖాస్తు చేసుకున్నారా? ఆయా పార్టీలు, నాయకుల మధ్య విభేదాలు ఇలా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని.. నియమ, నిబంధనలతో ఎన్‌వోసీని తిరిగి ఆర్వోకి పంపిస్తారు.
- చివరిగా ఆర్వో మాత్రమే అనుమతులు మంజూరు చేస్తారు.
- ఆర్వోకి మాత్రమే ఇంటింటా ప్రచారాలు, ర్యాలీ, సమావేశాలు, సభలకు అనుమతి ఇచ్చే అధికారం ఉంది.

**ఎంసీసీ బృందాలతో పర్యవేక్షణ**

- ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల పరిశీలన, పర్యవేక్షణ కోసం జిల్లాలో 63 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) బృందాలను ఏర్పాటు చేశారు.
- ఒక్కో బృందంలో ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌గా ఎంపీడీవో, ఓ వీడియో గ్రాఫర్, ఓ పోలీస్ అధికారి ఉంటారు.

### పటిష్ట భద్రతా ఏర్పాట్లు

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ ముగిసేందుకు అవసరమైన అన్ని భద్రతాపరమైన చర్యలు తీసుంటున్నామని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా నగరంలోని రౌడీషీటర్లకు ముందుగానే కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. వారిపై నిరంతర నిఘా ఉంటుందని వెల్లడించారు. జిల్లాలో ఉన్న 728 లైసెన్స్‌డ్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ప్రాంతంలో జంతువుల వేట కోసం రెండు నాటు తుపాకీలు వినియోగిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని, వారిపై నిఘా పెట్టామన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్

- ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో షిఫ్టులో 3 బృందాలు చొప్పున మూడు షిఫ్టుల్లో 9 బృందాలు పని చేస్తాయి.
- ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులను ఈ బృందాలు విచారణ చేపట్టి నివేదికను సమర్పిస్తాయి.

**ప్రత్యేక తనిఖీ బృందాలు**

- జిల్లాలో ఐదు స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్(ఎస్ఎస్‌టీ) పనిచేస్తున్నాయి. గతంలో బోర్డర్ చెక్‌పోస్టులుగా పరిగణించిన వాటిని ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎస్ఎస్‌టీగా మార్చారు.
- వీటితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు.
- వీటిల్లో ముగ్గురు సాయుధ పోలీసులు ఉంటారు.
- వీటిలో కూడా ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ హోదాలో ఎంపీడీవో నిర్ణయాధికారిగా వ్యవహరిస్తారు.
- ఎక్కడైనా, ఎవరైనా డబ్బు, ఇతర బహుమతులు పంపిణీ చేస్తున్నట్లు పోలీస్ కంట్రోల్ రూమ్, లేదా స్టేషన్‌కు ఫిర్యాదు చేస్తే.. నేరుగా పోలీసులు తనిఖీలు చేసి కేసు నమోదు చేసే అవకాశం లేదు.
- ఇలా వచ్చిన సమాచారాన్ని పోలీస్ అధికారులు ఎంసీసీ బృందాలకు చేరవేయాల్సి ఉంటుంది.
- ఎంపీడీవో పర్యవేక్షణలో పోలీస్, వీడియోగ్రాఫర్ సదరు ప్రాంతానికి వెళ్లి విచారణ చేపడతారు.
- అక్కడ డబ్బులు, మద్యం, ఇతర వస్తువులు, ఉల్లంఘనలు జరిగినట్లు ఆధారాలు లభిస్తే ఎంపీడీవో వాటిని సీజ్ చేసి పంచానామా రాసి.. వారు ఆధారాలతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేస్తారు.
- ఆ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేస్తారు.
- ఎన్నికల నిబంధనల ప్రకారం.. ఉల్లంఘనలకు సంబంధించి పోలీస్ అధికారులు ఎక్కడా స్వతంత్రంగా కేసులు నమోదు చేసే అవకాశం లేదు.

**జిల్లాకు మూడు కేంద్ర బలగాలు**

- ఎన్నికల విధుల కోసం పోలీస్ శాఖతో పాటు మూడు కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయి.
- రెండు సీఐఎస్ఎఫ్, ఓ ఆర్పీఎఫ్ నుంచి వచ్చిన బలగాలను జిల్లాలో మోహరిస్తున్నారు.

### రాజకీయపక్షాలు సహకరించాలి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా రాజకీయ పక్షాలు సహకరించాలని సీపీ రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. ఘర్షణలు, కొట్లాటలకు అవకాశం లేకుండా.. మత, కుల పరమైన పోస్టింగ్‌లతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీపీ సూచించారు. సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీ–1 మణికంఠ, డీసీపీ–2 సత్తిబాబు పాల్గొన్నారు.

- ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకునేలా ఈ బలగాలతో మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్నారు.
- ఒక్కో నియోజకవర్గానికి ఓ సీనియర్ పోలీస్ అధికారిని నియమించి.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

**జెండా పెట్టుకున్నా అభ్యర్థి ఎన్నికల ఖర్చులోనే..**

- పార్టీకి సంబంధించిన జెండా పెట్టుకున్నా అది ఆయా పార్టీ అభ్యర్థి ఎన్నికల ఖర్చు కింద జమైపోతుంది.
- అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేశారు.
- జెండా పెట్టుకున్నా, హోర్డింగ్‌లు, కటౌట్లు, సభల నిర్వహణ, వాటికి వచ్చే జనం, ఇలా అన్నింటినీ ఆ బృందం పరిగణలోకి తీసుకుంటుంది. అభ్యర్థి ఎన్నికల ఖర్చు కింద పరిగణిస్తుంది.
- సోషల్ మీడియా, టీవీ, పేపర్లలో వచ్చే వార్తల్లో ఉల్లంఘనలను మీడియా సెల్ మానిటరింగ్ సెంటర్ (ఎంసీఎంసీ) పర్యవేక్షిస్తుంది.

### 'సీ విజిల్' ద్వారా ఫిర్యాదుకు అవకాశం

- ఎన్నికల నిబంధనలు, నియమాలను ఎవరైనా ఉల్లంఘిస్తే రాజకీయ పార్టీలే కాకుండా ప్రజలు కూడా సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.
- ఆయా ఉల్లంఘనలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను అప్‌లోడ్ చేసి ఫిర్యాదు రిజిస్టర్ చేయవచ్చు.
- సువిధ యాప్‌లో కూడా కొంత మంది ఫిర్యాదులు చేస్తున్నారు. అయితే ఇందులో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత ఎంసీసీ బృందాలకు పంపిస్తున్నారు.
- ఉల్లంఘనలకు సంబంధించి డయల్ 100, 112 నంబర్లకు వస్తున్న ఫిర్యాదులను కంట్రోల్ రూమ్ సిబ్బంది సంబంధిత ఎంసీసీ బృందాలను సమాచారం ఇస్తున్నారు.
- ఇందులో వచ్చిన ఫిర్యాదులపై వెంటనే ఎంసీసీ హెడ్ ఎంపీడీవో బృందం వెళ్లి విచారిస్తుంది.
- వారు పరిశీలించి నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ఫిర్యాదు చేస్తే అప్పుడే పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు.
- డయల్ 100, 112 లేదా సువిధలో వచ్చిన ఫిర్యాదులపై పోలీసులు నేరుగా కేసు నమోదు చేసే అవకాశం లేదు.
- ఎంసీసీ బృందం విచారించిన తర్వాత ఎంపీడీవో ఫిర్యాదు చేస్తేనే పోలీసులు కేసు నమోదు చేస్తారు.

**100 నిమిషాల్లో నివేదిక**

- సీ విజిల్‌కు వచ్చే ఫిర్యాదులు ఏ స్టేషన్‌కు రిఫర్ చేస్తారో వారు 100 నిమిషాల్లో ఎన్నికల అధికారికి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.
- ఫిర్యాదు అందిన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి, వాస్తవాలను విచారించి, ఆధారాలు సేకరించి ఫిర్యాదు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

### తప్పుడు ఫిర్యాదులు చేస్తే చర్యలు

- తప్పుడు ఫిర్యాదులు చేసే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించనున్నారు.
- గతంలో కొంత మంది యువకులతో పాటు కొన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన వారు తప్పుడు ఫిర్యాదులు చేశారు.
- దీని వల్ల అధికారులు, పోలీసులకు విలువైన సమయం వృథా అవడంతో పాటు రాకపోకలకు అవనసరమైన వ్యయమవుతుంది.
- పార్టీ, అభ్యర్థులపై బురద జల్లడానికి తప్పుడు ఆరోపణలు చేసినట్లు రుజువైతే.. అటువంటి వారిపై 182 ఐపీసీ ప్రకారంతో పాటు న్యూసెన్స్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటారు.

# ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినహాయింపు లేదు

**తేల్చిచెప్పిన కలెక్టర్ మల్లికార్జున**

**మహారాణిపేట :** ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినహాయింపు లేదని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. అన్ని శాఖల పరిధిలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగులు, సిబ్బంది వివరాలను అందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పోల్ మేనేజ్‌మెంట్, సిబ్బంది కేటాయింపు, ఇతర అంశాలపై చర్చించే నిమిత్తం గురువారం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో కలెక్టరేట్ వీసీ హాలులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర సేవల్లో నిమగ్నమయ్యే వారు తప్ప మిగిలిన వారందరూ ఎన్నికల విధుల్లో పాల్గొనాల్సిందేనని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకారం అందించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సరిపడా సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నాటికి వివరాలను అత్యంత కచ్చితంగా సమర్పించాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో కె.మోహన్ కుమార్, వీఎంఆర్డీఏ జేసీ, మానవ వనరుల కేటాయింపు నోడల్ అధికారి రవీంద్ర, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో డీఆర్వో మోహన్‌కుమార్, వీఎంఆర్డీఏ జేసీ రవీంద్ర

# ఎస్ఈబీ విస్తృత తనిఖీలు

**విశాఖ సిటీ:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు సిబ్బందితో కలిసి నగరాన్ని జల్లెడ పడుతున్నారు. కొరియర్ కార్యాలయాలు, రైల్వేస్టేషన్, బస్‌కాంప్లెక్స్‌లను పరిశీలించారు. అలాగే జిల్లాలో ఆడవివరం, సరిపల్లి, అగనంపూడి, భీమిలి, చిన్నాపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. గంజాయి, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు, నగదు అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరంగా దాడులు చేస్తున్నట్లు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు వెల్లడించారు.



రైల్వేస్టేషన్‌లో స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు చేస్తున్న సెబ్ అధికారులు

విశాఖ సెబ్ స్టేషన్ పరిధిలో గత వారం రోజుల్లో 50 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

# కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.43.31లక్షలు

**డాబాగార్డెన్స్:** కనకమహాలక్ష్మి దేవస్థానంలో జనవరి 24 నుంచి ఈ నెల 21వ తేదీ వరకు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని గురువారం లెక్కించారు. మొత్తం రూ.43,31,258 నగదు వచ్చినట్లు ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అలాగే 24 యూఎస్ డాలర్లు, 2 ఖతార్ రియాల్స్, 50 ఈజిప్షియన్ పౌండ్స్, 5 టర్కిష్ లిరాలు, 60 సౌదీ రియాల్స్, 60 ఆస్ట్రేలియన్ డాలర్స్, 24 సింగపూర్ డాలర్స్‌తో పాటు చైనా, కెనడాకు చెందిన కరెన్సీ, 214 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారం, 796 గ్రాముల వెండి వచ్చిందని ఈవో వివరించారు. కనకమహాలక్ష్మి దత్తత ఆలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయానికి సంబంధించి రూ.25,484 ఆదాయం వచ్చిందని వెల్లడించారు. హుండీ లెక్కింపులో ఎర్నిమాంబ ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, కనకమహాలక్ష్మి ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ టి.ప్రశాంత్, వన్‌టౌన్ పోలీసులు, శ్రీహరిసేవ సభ్యులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

# 28న రీజనల్ డాక్ అదాలత్

**ఎంవీపీకాలనీ:** తపాలా వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న ఎంవీపీ కాలనీలోని తపాలా శాఖ రీజనల్ కార్యాలయంలో 113 తపాలా డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ రీజనల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ కేవీడీ సాగర్ తెలిపారు. అల్లూరి, పార్వతీపురం, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన తపాలా వినియోగదారులు వారి సమస్యలను ఈ నెల 27వ తేదీలోపు ఎంవీపీ కాలనీలోని రీజనల్ కార్యాలయం చిరునామాకు అందజేయాలన్నారు. 28న జరిగే డాక్ అదాలత్‌లో వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### రూ.4.92 కోట్ల స్టాంపుల దహనం


స్టాంపులను దహనం చేస్తున్న అధికారులు

**మహారాణిపేట:** జిల్లా ఖజానా కార్యాలయం స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ఉపయోగంలో లేని, చెడిపోయిన అన్ని రకాల స్టాంపులను జిల్లా ట్రెజరీ అధికారి వై.సుధాకరరావు ఆధ్వర్యంలో గురువారం సిబ్బంది దహనం చేశారు. 4,92,20,196 రూపాయల విలువైన ఉపయోగం లేని, చెడిపోయిన స్టాంపులు దహనం చేయడానికి కలెక్టర్ ఎ.మల్లికార్జున, జేసీ కె.మయూర్ అశోక్, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ అనుమతిచ్చారు. డీటీవో వై.సుధాకరరావు, అదనపు డీసీపీ ఎం.ఆర్.కె రాజు, జిల్లా ఫైర్ అధికారి జి.నాగార్జునరావు, ఎస్టీవో మూర్తి, జిల్లా ఖజానా కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.

### హ్యాండ్ టు హ్యాండ్ ప్రదర్శన, విక్రయాలు ప్రారంభం



**డాబాగార్డెన్స్:** ఉగాది పండగ, ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించే 'హ్యాండ్ టు హ్యాండ్' వస్త్ర ప్రదర్శన, విక్రయాలు గురువారం నగరంలోని హోటల్ గ్రీన్‌పార్క్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పోచంపల్లి, కలంకారి చీరలు, కోల్‌కతా భాగల్‌పురి ప్రింట్ చీరలు, బెనారస్ పట్టు చీరలు, చేనేత, రంగులు అద్దిన ప్రింట్లు, ఎంబ్రాయిడరీ చేసిన అద్భుత వస్త్రాలు విశాఖ ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. మట్కా సిల్క్, బైలూమ్ చీరలతో పాటు మల్బరి సిల్క్, చందేరీ చీరలు, కలంకారి ప్రింట్లు, మధ్యప్రదేశ్ నుంచి సేకరించిన ప్రత్యేక చీరలు విక్రయిస్తున్నట్లు తెలిపారు. సల్వార్‌లు, టాప్స్, లెనిన్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన 25వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఉంటుందని వెల్లడించారు.

# స్వయం ఉపాధికి 'తోడు'

- జగనన్న తోడుతో చిరువ్యాపారుల జీవితాల్లో సంతోషాలు
- రూ.10 వేలు చొప్పున రుణాలు మంజూరు చేసిన ప్రభుత్వం
- టీడీపీ హయాంలో రాబందుల్లా పీక్కుతిన్న కాల్‌మనీ కేటుగాళ్లు






### జగనన్న తోడు ఇలా...

| | |
|---|---|
| విశాఖ జిల్లాలో లబ్ధిదారులు | 56,537 |
| అందించిన మొత్తం | రూ.82.81 కోట్లు |
| అనకాపల్లి జిల్లాలో లబ్ధిదారులు | 1,30,370 |
| అందించిన మొత్తం | రూ.132.47 కోట్లు |
| అల్లూరి జిల్లాలో లబ్ధిదారులు | 3,180 |
| అందించిన మొత్తం | రూ.24.96 కోట్లు |



సాక్షి, విశాఖపట్నం / మద్దిపాలెం / తాటిచెట్లపాలెం / డాబాగార్డెన్స్: తెలుగుదేశం హయాంలో వడ్డీ వ్యాపారం లా మొదలై.. సామాన్యుల పాలిట భస్మాసుర హస్తంలా మారిన కాల్‌మనీ వ్యవహారం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. 'కాల్' యముళ్ల చేతిలో.. అరాచకాలకు గురైన బాధితుల చిట్టా ప్రతి జిల్లాలోనూ లక్షల్లో ఉంది. తవ్వేకొద్దీ వారి అక్రమాలు బయటపడ్డాయి. అధిక వడ్డీలకు రుణాలు ఇవ్వడమే కాకుండా.. తీసుకున్న అప్పు చెల్లించిన తర్వాత కూడా బాకీ ఉన్నారంటూ వేధింపులకు గురిచేసిన ఉదంతాలెన్నెన్నో.. మనిషి ఆర్థిక అవసరాలనే బలహీనతగా చేసుకుని.. వేలాది కుటుంబాలను రోడ్డున పడేసే వడ్డీ భూతాలు పీక్కుతిన్న పాపాల రోజులను ప్రజా సంకల్పయాత్రలో చూసి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చలించిపోయారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీ భారం లేకుండా చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేశారు. చిరు వ్యాపారం చేస్తున్న వారు ఆత్మస్థైర్యంతో ఆర్థికంగా వృద్ధిలోకి వచ్చేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకమే జగనన్న తోడు.

చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు.. రోజువారీ అవసరాల కోసం వడ్డీ వ్యాపారుల వద్ద చేయి చాచేవారు. 2014–19 మధ్య కాలంలో ఈ వడ్డీ బకాసురులు పేదల అవసరాలను బట్టి వందకు 5 నుంచి 10, 20, 30 రూపాయలు సైతం వడ్డీగా వసూలు చేసేవారు. 10 వేలు అప్పు కావాలంటే 9 వేలు ఇచ్చేవారు. సాయంత్రం సరికి 500 రూపాయల వడ్డీ వారి చేతిలో పెట్టాల్సిందే. లక్ష కావాలంటే 75 వేల రూపాయలిచ్చేవారు. 10 నెలల్లో మొత్తం లక్ష రూపాయలు చెల్లించాలి. గడవు దాటితే.. రోజుకు వెయ్యి రూపాయలు అదనంగా చెల్లించాల్సి ఉండేది. ఉదయం లక్ష రూపాయలు అప్పిచ్చారంటే... రాత్రయ్యే సరికి వెయ్యి నుంచి రెండు వేల రూపాయల వడ్డీ కట్టాల్సిందేనంటూ నిరుపేదలను నరకం చూపించేవారు. 2019 నుంచి ఆ దుర్భర పరిస్థితి పూర్తిగా దూరమైంది. వడ్డీ వ్యాపారుల విష వలయంలో చిక్కుకోకుండా.. చిరు వ్యాపారులకు చేయూతనందించేలా వడ్డీలేని రుణాలను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందజేసింది.

**ఎనిమిది విడతల్లో...**

చిన్న చిన్న దుకాణాలు నడిపేవారు, కూరగాయల వ్యాపారులు, పండ్లు, ఆహారపదార్థాలు అమ్ముకుని జీవించేవారు, రోడ్డపక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించేవారు, సైకిల్, మోటార్ సైకిల్, ఆటోలపై వెళ్లి వ్యాపారం చేసుకునేవారు, గంపలు, బుట్టలతో వస్తువులు అమ్మేవారు, హస్త కళాకారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారు వారి కాళ్ల మీద వారు నిలదొక్కుకునేలా జగనన్న తోడు పథకం కింద ఆర్థిక చేయూతనిచ్చింది. ఒక్కొక్కరికీ ఏటా రూ.10 వేల రుణం సున్నా వడ్డీకే అందజేసింది. రుణాలను సకాలంలో చెల్లించిన వారికి ఏడాదికి మరో రూ.1000 చొప్పున జోడిస్తూ రూ.13,000 వరకూ వడ్డీలేని రుణం అందించింది. వడ్డీని సైతం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వమే జమ చేసింది. ఇలా ఇప్పటి వరకు 8 విడతల్లో రుణాలు అందజేసింది.

### జగనన్న తోడుతో నిలదొక్కుకున్నా..



నా పేరు తీగెల వెంకటమ్మ. మాది తాటిచెట్లపాలెం దరి వాసుదేవనగర్. నేను ఇంటింటికీ తిరిగి కొండ చీపుర్లు అమ్ముతుంటాను. తద్వారా జీవనోపాధి పొందుతున్నాను. అయితే కరోనా సమయంలో చాలా కష్టాలు పడ్డాను. ఆ తర్వాత వ్యాపారంలో నిలదొక్కుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాను. ఆ సమయంలో జగనన్న తోడు నాకు చాలా ఉపయోగపడింది. ఈ పథకం ద్వారా రూ.10 వేల రుణం ఇచ్చారు. బయట వాళ్ల దగ్గర అప్పు చేస్తే ఆ వడ్డీలకే మా ఆదాయం సరిపోతుంది. కానీ ప్రభుత్వం అందజేసిన సొమ్ము చాలా ఉపయోగపడింది. ఎవరి మధ్యవర్తిత్వం లేకుండానే వలంటీర్, ఆర్పీల ద్వారా రుణం మంజూరైంది. ఆ రుణం తిరిగి చెల్లించేశాను. వడ్డీ ప్రభుత్వమే చెల్లించింది.

### కుటుంబ పోషణకు ఢోకా లేదు



నా పేరు పితాన సత్యభవాని. 31వ వార్డులో నివాసం ఉంటున్నాను. నా భర్త పితాన రామ్మూర్తి చనిపోయారు. కుమారుడు ఆటో డ్రైవర్. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. బతుకు బండిని ఎలా నెట్టుకురావాలన్న సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో నా సమస్యలు చాలా వరకు తీరాయి. జగనన్న తోడు పథకం ద్వారా కిరాణా దుకాణం పెట్టుకున్నాను. రూ.10 వేలు చొప్పున రెండు సార్లు రుణం మంజూరైంది. తీసుకున్న వడ్డీ లేని రుణం తిరిగి కట్టేశాను. వైఎస్సార్ పింఛన్ కానుక అందుతోంది. ఆసరా వచ్చింది. కిరణా దుకాణం ద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణకు ఢోకా లేదు.

### సీఎం జగన్.. మా బలం.. ధైర్యం



నా పేరు సింగిడి దేవి. మహత్‌కాలనీలో అమ్మ గౌరమ్మతో కలసి నివాసం ఉంటున్నాను. తండ్రి నా చిన్నప్పుడే చనిపోయారు. భర్తతో విడిపోయాను. మా బతుకుదెరువు కోసం ఐదేళ్ల కిందట పాన్‌షాపు ఏర్పాటు చేసుకుని.. తద్వారా వచ్చిన ఆదాయంతో జీవనం సాగిస్తున్నాం. ఆపదలో ఉన్న మమ్మల్ని ఈ ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన పలు పథకాలు ఆదుకున్నాయి. ముఖ్యంగా జగనన్న తోడు ద్వారా లబ్ధి పొందాను. వ్యాపార అభివృద్ధికి రెండు సార్లు రూ.10 వేలు చొప్పున రుణాలు తీసుకున్నాను. మొదటి సారి పూర్తిగా కట్టేశాను. దీనిపై వచ్చిన వడ్డీని ప్రభుత్వమే పూర్తిగా భరించింది. బయట చేతి రుణం తీసుకుంటే వడ్డీ భారం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వమే రుణాలు అందించడంతో చాలా మేలు జరిగింది. దీంతో పాటు ఆసరా, చేయూత అందింది. అమ్మకు పింఛన్ వస్తోంది. పరవాడ దగ్గర ఇల్లు కూడా మంజూరైంది. ఎటువంటి ఆసరా లేని మా లాంటి నిరుపేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండంత అండగా నిలిచారు. ఆయనిచ్చిన ధైర్యంతో హాయిగా జీవనం సాగిస్తున్నాం.

### కష్టాలు తీరాయి..



నా పేరు షేక్ వేణు. మాది నర్సీపట్నంలో శారదా నగర్. మాది చాలా పేద కుటుంబం. మా ఆయన హోటల్‌లో పనిచేసేవాడు. మెప్మా అధికారులు జగనన్న తోడు పథకం ద్వారా నర్సీపట్నం ఎస్‌బీఐ–ఏడీబీ బ్రాంచ్‌లో రూ.10 వేల రుణం ఇప్పించారు. ఆ పది వేలతో అదే బ్యాంక్‌కు ఎదురుగా మెయిన్ రోడ్డు పక్కన టీ దుకాణం ఏర్పాటు చేసుకున్నాను. టీ అమ్మకం ద్వారా రోజుకు రూ.600 నుంచి రూ.700 వరకు ఆదాయం సమకూరుతుంది. పెట్టుబడి పోగా రూ.400 వరకు మిగులుతుంది. అదివరకు నా భర్త పనికి వెళ్తేనే కానీ ఇల్లు గడిచేది కాదు. జగనన్న తోడు రుణంతో పెట్టుకున్న టీ దుకాణం కడుపు నింపుతోంది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750 అందుకుంటున్నాను. ఈ సొమ్ముతో టీ స్టాల్‌తోపాటు అరటిపండ్ల దుకాణం పెట్టాను. ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో మా పాపకు పెళ్లి చేశాను.

### వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా అనిల్ కుమార్



**గోపాలపట్నం:** వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా రాయపురెడ్డి అనిల్‌కుమార్‌ను నియమించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైఎస్సార్‌టీయూసీ విశాఖ జోన్ ఇన్‌చార్జి కలిదిండి బద్రినాథ్ పర్యవేక్షణలో అనిల్‌కుమార్ పనిచేస్తారు.

# మాజీ ఎమ్మెల్యే తైనాల ఇంట్లో చోరీ

- రూ. 8 లక్షల నగదు, బంగారు ఆభరణాల అపహరణ
- సీసీ కెమెరాలు పరిశీలించిన డీసీపీ–1 మణికంఠ చందోల్


ఇంటి ఆవరణలో తైనాల విజయ్‌కుమార్


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**డాబాగార్డెన్స్:** మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు తైనాల విజయ్‌కుమార్ ఇంట్లో దొంగ చొరబడ్డాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆయన భార్యను కత్తితో బెదిరించి ఆమె పది తులాల బంగారు ఆభరణాలతో పాటు బీరువాలో ఉన్న నగదు ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన గురువారం రాత్రి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. డాబాగార్డెన్స్ లలితానగర్‌లో తైనాల విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన భాగంగా ఎస్.కోట వెళ్లారు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో ఆయన భార్య లక్ష్మీరాజ్యం వంటగదిలో ఉండగా ఓ దొంగ ఇంట్లోకి చొరబడ్డాడు. ఇంటి లోపలకు వెళ్లిన దొంగ లక్ష్మీరాజ్యం ముఖంపై స్ప్రే చల్లడంతో ఆమె మత్తులోకి వెళ్లారు. మెడలో పుస్తెలతాడు లాక్కున్నాడు... ఆమెకు మెలకువ వచ్చేసరికి మెడపై కత్తి పెట్టి బెడ్ రూమ్‌లోకి తీసుకెళ్లి కబోర్డ్ ఓపెన్ చేయించాడు. అనంతరం బాత్‌రూమ్‌లో పెట్టి గడియ పెట్టేశాడు. అరిస్తే చంపేస్తానని బెదిరించాడు. లాకర్ ఓపెన్ చేసి పది తులాల బంగారు ఆభరణాలు, రూ.8 లక్షల నగదు దొంగలు ఎత్తుకెళ్లాడు. సమాచారం అందుకున్న తైనాల వెంటనే ఇంటికి చేరుకొని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, డీసీపీ–1 మణికంఠ చందోల్ సిబ్బందితో వచ్చి పరిసరాల్లో సీసీ కెమెరాలు పరిశీలించారు. ఒక్కడే ఇదంతా చేసినట్టు గుర్తించామని, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు క్రైమ్ డీసీపీ వెంకటరత్నం తెలిపారు. క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఇది తెలిసిన వ్యక్తుల పనే..** : 'ఎస్.కోటలో ఎన్నికల ప్రచారంలో ఉన్న తనకు ఇంటి నుంచి ఫోన్ రాగానే వెంటనే వచ్చాను. నా భార్య కన్నీరు పెడుతూ కనిపించింది. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్న దొంగలు ఈ చోరీకి పాల్పడ్డారని' తైనాల తెలిపారు. ఇంట్లో ఉన్న కుక్క ఇటీవలే చనిపోయింది. ఇది తెలిసిన వ్యక్తులే పనేనని అభిప్రాయపడ్డారు.

### 2,899 మందికి వైద్య సేవలు

**మహారాణిపేట:** జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా గురువారం బాలాజీనగర్, ఎంఎస్ఆర్ నగర్, లాసన్స్‌బే కాలనీ, ఇసుకతోట, రైల్వే న్యూకాలనీ, జబ్బరితోట, కంచరపాలెం, సిద్ధేశ్వరం, న్యూ గాజువాక, నరసింహనగర్ తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు జరిగాయి. ఈ శిబిరాల్లో మొత్తం 2,899 మందికి వైద్య సేవలందించారు.

# పరామర్శకు వచ్చి.. మృత్యు ఊబిలో చిక్కి..

- శారదా నదిలో మునిగి ఒకరు మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- దయాల్‌నగర్‌లో విషాదచాయలు


రామకృష్ణను 108లో తరలిస్తున్న స్థానికులు

**పెదగంట్యాడ / చోడవరం రూరల్:** మాడుగుల దగ్గరలోని భోగాపురంలో బంధువులను పరామర్శించడానికి వెళ్లి వస్తూ గోవాడ దరి శారదా నదిలో స్నానానికని దిగి ఒకరు ప్రాణం కోల్పోగా, మరొకరు ప్రాణాలమీదికి తెచ్చుకున్నారు. ఈ విషాద ఘటనలో పెదగంట్యాడ మండలం దయాల్‌నగర్‌లో నివసిస్తున్న పెంటకోట యుగంధర్(31) మృతి చెందగా, అదే ప్రాంతానికి చెందిన భీశెట్టి రామునాయుడు కుమారుడు రామకృష్ణ అపస్మారక స్థితిలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. దయాల్‌నగర్‌కు చెందిన యుగంధర్, రామకృష్ణ గురువారం ఉదయం భోగాపురంలో బంధువులను పరామర్శించడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గోవాడ వద్ద శారదా నదిలో స్నానానికి దిగారు. లోతు తెలియక నదిలో యుగంధర్ గల్లంతు కావడంతో రక్షించేందుకు రామకృష్ణ ప్రయత్నించాడు. అతడు కూడా నీటమునగడంతో కేకలు వేశాడు. సమీపంలోని వారు వచ్చి అతడిని నది ఒడ్డుకు లాగారు. అనంతరం 108లో చోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం ఎన్టీఆర్ ఆస్పత్రికి పంపించారు. సమాచారం అందుకున్న చోడవరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకుని యుగంధర్ మృతదేహాన్ని వెలికి తీశారు. అతని తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. రామకృష్ణ అనకాపల్లి ఆస్పత్రిలో కోలుకుంటున్నట్టు సీఐ తెలిపారు.

**దయాల్‌నగర్‌లో విషాదం**

యుగంధర్ మృతితో దయాల్‌నగర్‌లో విషాదచాయలు అలముకున్నాయి. అతని కుటుంబం 30 ఏళ్ల కిందట భోగాపురం నుంచి ఇక్కడకు వలస వచ్చింది. అతని తండ్రి మరణించగా.. తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన యుగంధర్.. ఇటీవల ఇక్కడకు చేరుకున్నాడు. భోగాపురంలోని బంధువు అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తూ నదిలో స్నానానికి దిగాడు. ఊబిలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. ఎన్టీఆర్ ఆస్పత్రిలో యుగంధర్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి దయాల్‌నగర్‌కు తీసుకువచ్చారు. అతని తల్లి వరలక్ష్మి, బంధువులు విషాదంలో మునిగిపోయారు. అతని తల్లి రోదించిన తీరు అక్కడి వారిని కలచివేసింది.

# అదుపు తప్పి పెళ్లి బృందం కారు బోల్తా

**పెళ్లి కుమార్తెతో సహా ఎనిమిది మందికి గాయాలు**


గాయపడిన పెళ్లి కుమార్తె రాజేశ్వరి, రఘు, కృష్ణవేణి


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

**ఆనందపురం :** మండలంలోని శొంఠ్యాం వద్ద ఆరు లేన్లు రహదారిపై గురువారం పెళ్లి బృందంతో వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడడంతో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరంతా సంగివలసలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో పెళ్లి కుమార్తె కూడా ఉండడంతో విషాదం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. విజయవాడకు చెందిన పెళ్లి కుమార్తె రాజేశ్వరితో సహా ఎనిమిది మంది కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి కారులో బయలు దేరి శ్రీకాకుళం జిల్లా, లావేరు మండలం, గూడూరులో వివాహానికి వెళ్తున్నారు. ఆ కారు మండలంలోని శొంఠ్యాం సమీపానికి చేరుకునే సరికి అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో కారు నడుపుతున్న పోతూరి వీరభద్రరావు, పెళ్లి కుమార్తె రాజేశ్వరి, ఆమె మేనత్త మోదూరి కృష్ణవేణి, కర్రాటు నాగలక్ష్మి, కౌశిక్, సుప్రియ, వశిష్ట, రఘు గాయపడ్డారు. కారులో నుంచి ఎగిరిపడి గాయాలు పాలైన వారిని ట్రాఫిక్ ఎస్ఐ సునీల్ సిబ్బంది చికిత్స కోసం సంగివలసలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆనందపురం ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.